క్లుప్తంగా

కార్యకర్తకు ఎమ్మెల్యే పరామర్శ



మోహన్‌ను పరామర్శిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): మండలంలోని లింగంపేట మాజీ సర్పంచ్ గొడుగు అంజయ్య కుమారుడు మోహన్‌ను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి యశోదా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మోహన్‌ను ఎమ్మెల్యే పరామర్శించి ప్రమాద ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు మల్లారెడ్డి, నర్సింహులు, యాదగిరి ఉన్నారు.

బ్యాంకు భవన నిర్మాణ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న శరత్‌రావు

బెజ్జంకి(సిద్దిపేట): నూతనంగా నిర్మిస్తున్న కేడీసీసీ బ్యాంక్ పనులను ఆదివారం బెజ్జంకి సహకార సంఘం చైర్మన్ తన్నీరు శరత్‌రావు ఆదివారం పరిశీలించారు. నాణ్యతతో వేగవంతంగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్ బాలయ్యకు సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండి రమేశ్, డైరెక్టర్లు నరేశ్‌బాబు, సీత భూమయ్య, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జునుడి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పొట్లపల్లిలో మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం కేతకీ మేడలమ్మ మల్లికార్జునస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ మహోత్సవంలో చంద్రమౌళి, కానుగుల మోహన్ దేవతా విగ్రహాలను బహూకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు జగదీశ్వరచారి, అనిల్‌కుమార్, రవీందర్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

కొండపోచమ్మ ఆలయంలో భక్తుల సందడి



దర్శనానికి బారులు తీరిన భక్తులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ నర్సాపూర్ సమీపంలోని కొండపోచమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఆఖరి వారం కావడంతో ఆదివారం ఉదయం కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నం కొండపోచమ్మ ఆలయానికి చేరుకొని అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్లు ఆలయ సిబ్బంది మహేందర్‌రెడ్డి తెలిపారు.

త్రిశతి పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

సిద్దిపేట ఎడ్యుకేషన్: ప్రముఖ కవి డాక్టర్ ఎస్ఎస్ రాజు రచించిన 'వెళ్లి రావయ్య.. శుభకర వేద్కుమీర' త్రిశతి పుస్తకాన్ని జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి రవీందర్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. స్థానిక ఇంటర్మీడియెట్ స్పాట్ వాల్యుయేషన్ క్యాంపులో జరిగిన ఈ కార్యక్రమంలో ఏసీఓలు సత్యనారాయణ, దేవస్వామి, చెన్నూరి శ్రీనివాస్, గంగాధర్, కోడింగ్ అధికారి శ్రీనివాస్, రాజమౌళి, సుమన్, శ్రీలీల, వెంకటేశ్, చంద్రమోహన్, కనకచంద్రం దరిపల్లి నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

తేలిన కంకర..పయనం ఎలా?

మిరుదొడ్డి(దుబ్బాక): కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా ఉన్న గ్రామీణ ప్రాంత రోడ్లతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. కంకర తేలి, గోతులమయంగా మారిన రోడ్లపై వెళ్ళాలంటే జంకుతున్నారు. మిరుదొడ్డి, అందె, కాసుబాద్, మోతె, లక్ష్మీనగర్ తదితర గ్రామాలకు వెళ్ళే రోడ్లు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. దీంతో వాహనాలు అదుపుతప్పడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫలితంగా వాహనదారులు గాయాల పాలవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి గ్రామీణ ప్రాంత రోడ్లకు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని ప్రజలు వేడుకొంటున్నారు.



కంకర తేలిన అందె రోడ్డు



నడవలేని స్థితిలో మిరుదొడ్డి రోడ్డు

నర్సారెడ్డి పోరాటానికి మద్దతు: మంత్రి పొన్నం



గజ్వేల్: మాజీ సీఎం కేసీఆర్‌పై డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి చేస్తున్న పోరాటానికి తమ మద్దతు ఉంటుందని మంత్రి పొన్నం చెప్పారు. మేడ్చేల్ జిల్లా శామీర్ పేటలో ఆదివారం నర్సారెడ్డిని కలిసి సంఘీభావం తెలిపారు. కేసీఆర్ ఇప్పటికైనా ఫామ్ హౌస్‌ను వీడి ప్రజల్లోకి రావాలని డిమాండ్ చేశారు.

ఆధ్యాత్మికత, ధార్మికతకు నెలవు సిద్దిపేట

ఎమ్మెల్యే హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆధ్యాత్మికత, ధార్మికతకు సిద్దిపేట నెలవు అని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని రామ రాజు రావి చెట్టు హనుమాన్ దేవాలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నదానం గొప్ప కార్యక్రమని, హనుమాన్ స్వాములకు అన్నదానం సిద్దిపేట నుంచే ప్రారంభమైందన్నారు. అమర్‌నాథ్ అన్నదాన సేవ సంస్థ ఆధ్వర్యంలో అమర్‌నాథ్‌లో దక్షిణ భారతదేశంలోనే ఫస్ట్ లంగర్ ఏర్పాటు చేసుకున్నామని, అయోధ్యలో అన్నదానం చేయడానికి కూడా సిద్దిపేటకే అవకాశం దక్కిందన్నారు. అనంతరం ట్రస్ట్ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు.

అందరం బాగుండాలి

రేణుకాఎల్లమ్మ, పెద్దమ్మల ఆశీస్సులతో పాడిపంటలు, ఆయురారోగ్యాలతో అందరం బాగుండాలని హరీశ్‌రావు అన్నారు. రేణుకా ఎల్లమ్మ, పెద్దమ్మ ఆలయాలను సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని పెద్దమ్మ ఆలయ అభివృద్ధికి గత ప్రభుత్వ హయాంలో రూ.32లక్షలు మంజూరు చేయించుకొన్నామని, రాష్ట్రంలోనే ఆదర్శగౌడ కన్వెన్షన్ సిద్దిపేటలో రూ.5 కోట్లతో నిర్మించుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో ముదిరాజ్, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పెద్దమ్మ తల్లిని దర్శించుకుంటున్న హరీశ్‌రావు

బీరప్ప దయతో..

సిద్దిపేటరూరల్: బీరప్ప దయతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని హరీశ్‌రావు ఆకాంక్షించారు. మండల పరిధిలోని రాఘవపూర్ మధిర గ్రామమైన ఇంద్రగూడెంలో జరిగిన బీరప్ప ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు గ్రామ ప్రజలు డప్పులు, బోనాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీరప్ప ఉత్సవాల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కురుమ సంఘం సభ్యులు స్వామి, రమేశ్, రాజు, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

తొగుట(దుబ్బాక)/చిన్నకోడూరు(సిద్దిపేట): మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీపై ప్రభుత్వం వ్యవసాయ పరికరాలు అందజేస్తోందని తొగుట ఏఓ మోహన్, చిన్నకోడూరు మండల వ్యవసాయ అధికారి జయంత్ కుమార్ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. బ్యాటరీ, పవర్ స్ప్రేయర్లు, కల్టీవేటర్లు, కేజ్ వీల్స్ తదితర పనిముట్లు అందుబాటులో ఉన్నాయని వారు తెలిపారు. దరఖాస్తు పత్రంతో పాటు భూమి పాస్‌బుక్, ఆధార్ కార్డు, అలాగే ట్రాక్టర్ ఆధారిత పనిముట్లకు ట్రాక్టర్ ఆర్‌సీ బుక్ జతపరచాలని, ఈ అవకాశాన్ని మహిళా రైతులు సద్వినియోగంచేసుకోవాలని వారు కోరారు.

చెక్కుల పంపిణీ

దుబ్బాకటౌన్: ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు రాజిరెడ్డి అన్నారు. రాయపోల్‌కు చెందిన స్వరూపకు మంజూరైన రూ.10,500ల సీఎం సహాయనిధి చెక్కును ఆదివారం ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో మురళి గౌడ్, మహమ్మద్ రఫీ, మహేశ్ తదితరులున్నారు.

ఇందుప్రియాల్‌లో..

దౌల్తాబాద్(దుబ్బాక): మండల పరిధిలోని ఇందుప్రియాల్ గ్రామానికి చెందిన తుప్పతి రాజయ్యకు మంజూరైన రూ. 48 వేలు, అలాగే దొడ్డి స్వామికి మంజూరైన రూ.13,500 చెక్కులను పాక్స్ చైర్మన్ వెంకట్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ జ్యోతి, మాజీ సర్పంచ్ శ్యామల, వీరమ్మ తదితరులు అందజేశారు.

ఎవరి కోసం నర్సారెడ్డి పాదయాత్ర?

బీఆర్ఎస్ నేతలు

గజ్వేల్: అధికార పార్టీలో ఉండి నర్సారెడ్డి ఎవరి కోసం పాదయాత్ర చేస్తున్నారో చెప్పాలని బీఆర్ఎస్ గజ్వేల్, కొండపాక మండలాల పార్టీ అధ్యక్షులు బెండె మధు, నూనె కుమార్, పట్టణశాఖ అధ్యక్షుడు నవాజ్‌మీరా, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, నాయకులు జుబేర్, బొగ్గుల చందు, రమేశ్‌గౌడ్ మండిపడ్డారు. ఆదివారం గజ్వేల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అభివృద్ధిలో గజ్వేల్‌ను 50యేళ్లు ముందుకు తీసుకువెళ్లారని, సోయి లేకుండా విమర్శలు చేయడం మానుకోవాలని చెప్పారు. సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్, నాగరాజు, ఎల్లయ్య, నర్సింగరావు, కనకయ్య, అమర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

హామీలు నెరవేర్చకపోతే మరో ఉద్యమం

టీయూఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు నివాస్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎన్నికల ముందు ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే మరో ఉద్యమం తప్పదని టీయూఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ హెచ్చరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన మేనిఫెస్టోను అమలు చేయాలని కోరుతూ ఉద్యమకారుల ఫోరం టీయూఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన చైతన్యయాత్ర ఆదివారం సిద్దిపేటకు చేరుకొంది. రంగదాంపల్లి చౌరస్తా తెలంగాణ అమరవీరుల స్తూపానికి నాయకులు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర సాధన ఉద్యమంలో 1,200 మంది బలిదానాలు చేసుకొన్నారన్నారు. వేలాది మంది ఉద్యమకారులు నిర్బంధాలు, అక్రమ కేసులకు గురై జీవితాలను త్యాగం చేశారని గుర్తుచేశారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమకారులను విస్మరించిందని వాపోయారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల స్థలంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని, నెలకు రూ.25వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జూన్ 2లోపు హామీలు అమలు చేయకపోతే మరో ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఏప్రిల్ 21న హైదరాబాద్‌లో జరిగే ప్లీనరీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉద్యమకారులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఉద్యమకారులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



హుస్నాబాద్: పూర్వ విద్యార్థులతో మంత్రి పొన్నం ప్రభాకర్

దుబ్బాకటౌన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1972- 75 డిగ్రీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. యాభై ఏళ్ల తర్వాత వారంతా రాయపోల్ మండలం వడ్డేపల్లిలో తమ కుటుంబాలతో సహా కలుసుకొని సందడి చేశారు. కార్యక్రమానికి నందిని సిధారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రిటైర్డ్ పోస్ట్‌మాస్టర్ జగన్మోహన్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు గాల్ రెడ్డి, నాగభూషణం, అంజయ్య, జయసూర్య, రామచందర్ రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చేర్యాల(సిద్దిపేట): గురువులతో పూర్వ విద్యార్థులు

35 యేళ్ల తర్వాత..

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో 1989-90లో పదోతరగతి చదువుకొన్న విద్యార్థులు స్థానిక వివేకానంద ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. 35 యేళ్ల తర్వాత వారంతా కలుసుకొని ఆ నాటి ఘటనలకు గుర్తుచేసుకొన్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎర్రబెల్లి సుధీర్, ఉప్పల ప్రేమ్‌కుమార్, అవుశర్ల నర్సింహులు, దుద్దిళ్ల కృష్ణ, మల్లవజ్జుల చంద్రశేఖరశర్మ తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో...

హుస్నాబాద్: స్థానిక ఉన్నత పాఠశాలలో 1974-75లో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు లక్ష్మీ గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు.



దుబ్బాకటౌన్: సమ్మేళనంలో పాల్గొన్న, 1972-75 బ్యాచ్ విద్యార్థులు

భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిద్దాం

టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రతినిధి తిరుపతిరెడ్డి

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని జిల్లాలో పలు సంఘాల నాయకులు ఆదివారం నిర్వహించారు. వారి విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిస్తూ ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/కోహెడ(హుస్నాబాద్)/బెజ్జంకి(సిద్దిపేట)/జగదేవ్‌పూర్(గజ్వేల్)/చేర్యాల(సిద్దిపేట)/దుబ్బాకటౌన్: జిల్లా కేంద్రంలోని టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి తదితర నాయకులు భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విజయేందర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ జానకి రాములు, నాయకులు రాములు, గోపాల్ రెడ్డి, శివాజీ, చంద్రశేఖర్, రామ్ కిషన్, శివరాజం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆదిత్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు పరశురాం, అనీశ్, సాయి శంకర్, శ్రవణ్, శివ, కార్తీక్, విష్ణు, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు. కోహెడలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శేఖర్, అంతయ్య తదితరులు పాల్గొన్నారు. బెజ్జంకిలో ఏఐవైఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు బొనగిరి రూపేశ్ భగత్‌సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ చేసిన పోరాటం, స్ఫూర్తి ఎంతో గొప్పదన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దంతరవేణి మహేశ్, విజయ్, తిరుపతి, వెంకటేశ్, శ్రీనివాస్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ గ్రామంలో భగత్‌సింగ్ విగ్రహం వద్ద సీపీఐ రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యుడు దయానంద్‌రెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ చేర్యాల అంగడి బజారు వద్ద భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు భూమయ్య, సిద్దయ్య, సుదర్శన్, లచ్చయ్య, అజీమ్, జస్వంత్, సిద్ధు, వర్ధన్ తదితరులు పాల్గొన్నారు. దుబ్బాకలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భగత్‌సింగ్ విగ్రహం వద్ద టీపీటీఎఫ్ నాయకుల నివాళులు



జగదేవ్‌పూర్(గజ్వేల్): నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

శుభకార్యాలకు పంచాంగం ముఖ్యం

గజ్వేల్‌రూరల్: ఆధ్యాత్మిక, శుభకార్యాలను నిర్వహించడం కోసం పంచాంగం చాలా ముఖ్యమని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. స్థానిక మురళీకృష్ణాలయంలో వాసవీమాత చలివేంద్రం నిర్వాహకుల ఆధ్వర్యంలో ఆదివారం నూతన పంచాంగాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చలివేంద్రం ద్వారా ప్రజల దాహార్తిని తీర్చడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, బీజేపీ నాయకులు జశ్వంత్‌రెడ్డి, విద్యుత్‌శాఖ ఏఈ మారుతి, శివకుమార్, భిక్షపతి, సత్యనారాయణ, సిద్ధి భిక్షపతి, నారాయణ, వెంకటేశం పాల్గొన్నారు.



సంక్షిప్త వార్తలు

◆ **వేతనాలు చెల్లించాలి**

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వం వెంటనే వేతనాలను చెల్లించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) అక్బర్‌పేట-భూంపల్లి మండలశాఖ అధ్యక్షుడు పెరుమాండ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మిరుదొడ్డిలో మాట్లాడుతూ విద్యా సంవత్సరం ముగుస్తున్నప్పటికీ కార్మికులకు మూడు నెలల వేతనం మాత్రమే ప్రభుత్వం చెల్లించిందన్నారు.

◆ **జాతీయ సెమినార్‌కు ఏర్పాట్లు పూర్తి**

సిద్దిపేట ఎడ్యుకేషన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 26, 27న 'అట్టడుగు వర్గాల సమానత్వం.. సంలిత సమాజం' అనే అంశంపై జరగనున్న జాతీయ సెమినార్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయని సెమినార్ కన్వీనర్ డాక్టర్ శ్రద్ధానందం ఆదివారం తెలిపారు. ముఖ్య అతిథులుగా ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, బీసీ కమిషన్ మెంబర్ బాలలక్ష్మి తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.

◆ **బెట్టింగ్‌ల జోలికి పోవద్దు: సీఐ**

దుబ్బాకటౌన్: యువత ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌లకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సీఐ శ్రీనివాస్ సూచించారు. ఆదివారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో యువకులు బెట్టింగ్‌లకు పాల్పడినా, ప్రోత్సహించినా అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

◆ **గ్రామాభివృద్ధికి నిధులు**

కొండపాక(గజ్వేల్): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోందని కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షుడు కరుణాకర్ అన్నారు. మండల పరిధిలోని సిర్సనగండ్ల గ్రామంలోని కాశతుర్క కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 5 లక్షలతో 95 మీటర్ల వరకు పనులను పూర్తి చేశామన్నారు. పీఆర్ ఏఈ తిరుపతిరెడ్డి, నాయకులు ఆరీఫ్ పాల్గొన్నారు.

◆ **రాజకీయంగా ఎదగాలి**

నంగునూరు(సిద్దిపేట): పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలని అదనపు పీపీ సాదుల ఆత్మారాములు అన్నారు. జిల్లా కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన ఆయనను ఆదివారం నంగునూరు పద్మశాలీసంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రచ్చ సిద్ధు, దాసరి రామలింగం, రాజేశ్, రవి, రాము, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

◆ **మంత్రి కృషితో గ్రామాల అభివృద్ధి**

నంగునూరు(సిద్దిపేట): జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ చొరవతో మండలానికి నిధులు మంజూరయ్యాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు యాదగిరి అన్నారు. వెంకటాపూర్, కోనాయిపల్లిలో సీసీ రోడ్డు పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో శంకర్, మల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి, బాలరాజు, స్వామి, సంపత్, రాజు, చంద్రయ్య, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ **బీజేపీ నేతల అన్నదానం**

సిద్దిపేటకమాన్/చిన్నకోడూరు(సిద్దిపేట)/గజ్వేల్ రూరల్: మెదక్ ఎంపీ రఘునందన్‌రావు జన్మదిన వేడుకలను సిద్దిపేట పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ చౌరస్తాలో బీజేపీ నాయకులు ఆదివారం కేక్ కట్‌చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చిన్నకోడూరులోని అనంతసాగర్ వృద్ధాశ్రమంలో బీజేపీ నాయకులు వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అదే విధంగా గజ్వేల్‌లోని ఇందిరాపార్కు చౌరస్తా వద్ద అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జశ్వంత్‌రెడ్డి, రాంరెడ్డి, మహేశ్, మధుసూదన్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ **స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యం**

సిద్దిపేటకమాన్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బహుజన్ సమాజ్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆ పార్టీ నాయకులు కార్యకర్తలకు సూచించారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు మాట్లాడుతూ బూత్ కమిటీల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు.